క్లుప్తంగా

వాహనాల తనిఖీ



ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అలాగే వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

తెలుగు సాహిత్యంపై పట్టు సాధించాలి



అమరచింత: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు డీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం 350 తెలుగు సాహిత్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు రెడ్‌క్రాస్ జిల్లా సభ్యుడు శ్యాం తెలిపారు. డీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్, మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఆదేశాలతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తెలుగు సాహిత్య పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, బాలస్వామి, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ పోటీలకు మామిడిమాడ విద్యార్థులు



ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ లీగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం భాస్కర్ తెలిపారు. ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ జరుగుతుందన్నారు. ఈ పోటీలో మ్యూజికల్ ఫామ్ ఈవెంట్‌లో పాఠశాల విద్యార్థులు వైష్ణవి, ఐశ్వర్య, కె.వైష్ణవి, దివ్య, భార్గవి, సింధు, నందిని, నిహారిక పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను సర్పంచు మోహన్‌జీ, కరాటే మాస్టర్ శివకృష్ణ, ఉపాధ్యాయులు రవిశంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, శారద తదితరులు అభినందించారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా తప్పదు



వనపర్తి టౌన్: రోడ్లపై చెత్త వేస్తే భారీ జరిమానా విధిస్తామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆహా హోటల్ పక్కన ఉన్న ఉమామహేశ్వరి మెడికల్ ఏజెన్సీ షాపు చెత్తను రోడ్డుపై వేశారు. దీంతో మున్సిపల్ అధికారులు మంగళవారం రూ.3వేల జరిమానా విధించి షాపు యజమానికి రశీదును అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. షాపులోని చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా విధించడమే కాకుండా లైసెన్స్‌ను రద్దు చేస్తామన్నారు. చెత్తను మున్సిపల్ చెత్త ట్రాక్టర్, ఆటోలో వేయాలని సూచించారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి సామర్థ్యాలు పెంచేలా బోధన చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ ధారాళంగా చదవడంపై వారిని ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, సీఆర్పీ గోవింద్ పాల్గొన్నారు.

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం



మదనాపురంలో..



శాగాపూర్‌లో విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

అమరచింత: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్న పది, ఐదో తరగతి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం టీడీ టీకాలు వేస్తున్నామని తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు మంగళవారం టీడీ వ్యాక్సిన్లు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిత, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, హెడ్ మాస్టర్ కరుణాకర్ పాల్గొన్నారు.

పాన్‌గల్: క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవడంతో రోగ నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి, కదిరెపాడు, శాగాపూర్ గ్రామాల్లో 5, 10వ తరగతి విద్యార్థులకు టెటానస్ టాక్సైడ్ టీకాలు వేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ టీకా వేయడంతో కంఠవాతం, ధనుర్వాతం నుంచి కాపాడుకోవడం జరుగుతుందన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమనశ్రీ, శ్రీలక్ష్మి, సుమిత్ర, రాంచందర్, ఉపాధ్యాయ బృందం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మదనాపురం: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాల విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్లు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్, గురుకుల ప్రిన్సిపాల్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రమీల తదితరులు ఉన్నారు.



అమరచింతలో..

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు ఫిర్యాదు అందిస్తున్న అరుణ్‌కుమార్

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 10/2, 34, 35లో గల సుమారు రెండు ఎకరాల స్థలాన్ని లేఅవుట్‌గా మార్చి డీటీసీపీ అనుమతి లేకుండా ప్లాట్లు విక్రయిస్తున్నారని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా అరుణ్ మాట్లాడుతూ 2019లో అమరచింత పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందిందని, కానీ గ్రామ పంచాయతీ ద్వారా నాలా పర్మిషన్ పొందినట్లు నకిలీ పత్రాలు సృష్టించారన్నారు. ఈనెల 5వ తేదీన శాంత అనే మహిళ కిరణ్‌కుమార్‌కు ఈ లేఅవుట్‌లో గల 44 ప్లాట్లను జీపీ ప్రకారం రిజిస్ట్రేషన్ చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై విచారణ జరిపి అనుమతి లేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న వంగూరు రాములు

కొత్తకోట రూరల్: భవన నిర్మాణ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను వెల్ఫేర్ బోర్డు నిధుల ద్వారా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు కోరారు. మంగళవారం కొత్తకోటలో అంబ భవానీ తాపీ కార్మిక సంఘం ఏర్పాటు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 60ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికుడికి రూ.6వేలు పెన్షన్ అమలు చేసి, డిగ్రీ, ఉన్నత చదువుల చదువుతున్న భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. పంజాబ్ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లల ఉన్నత చదువుల కోసం రూ.లక్ష స్కాలర్‌షిప్ ఇస్తున్నారని, అదే తరహాలో మన రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డులో రూ.4,750కోట్లు ఉన్నాయని, ఆ నిధులు కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కరోనా సమయంలో వెల్ఫేర్ బోర్డులో ఉన్న నిధులను రూ.1,005 కోట్లను పౌర సరఫరాల ద్వారా పక్కదారి పట్టించదన్నారు. బీసీ బంధుకు రూ.250కోట్లు దారి మళ్లించి కార్మికుల సంక్షేమం కొరకు ఖర్చు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, పుట్ట ఆంజనేయులు, నిక్సన్, అస్కనీ శ్రీను, శ్రీను, జనార్దన్, దుప్పటి శ్రీను, కార్యదర్శి కురుమూర్తి, కోశాధికారి నరేష్, శాంతన్న, ఉప్పరి రాజు, సంద ఆంజనేయులు, రాములు తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



పెబ్బేరులో..



కొత్తకోట ఎమ్మార్సీ భవనం వద్ద క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద పీఆర్‌టీయూ–2024 క్యాలెండర్‌ను మంగళవారం ఆ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్న పీఆర్‌టీయూకు ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణయ్య, కుర్మయ్య, నిర్మలాదేవి, సూర చంద్రశేఖర్, ఎస్.సత్యనారాయణ, కె.లక్ష్మయ్య, సునీల్‌కుమార్, శ్రీశైలం, శివకుమార్, శ్రీదేవి, లక్ష్మీనారాయణగుప్తా, మహిళా ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని ఎంఈఓ ఆఫీస్‌లో మంగళవారం ఎంఈఓ జయరాములు పీఆర్టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సూగూరు వరప్రసాదరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ టీఎస్ ఎల్లప్పుడు ముందు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలరాజు, అధ్యక్షుడు శివశంకర్, చిన్న రాములు, అశోకవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి దామోదర్, ఉపాధ్యాయులు శ్రీవిద్య, పుష్పకుమారి, ప్రసన్నలక్ష్మి, జ్ఞానలక్ష్మి, సుమిత్రమ్మ, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లికి చెందిన మూలె కుర్మయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందారు. బాధిత కుటుంబానికి మంగళవారం జైభీం స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యుల సహకారంతో రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వీరి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సంస్థ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిద్ది రవి, నాగముని, ధర్మేందర్, కృష్ణ, శ్రీను, ఉపాధ్యాయులు రాము తదితరులు పాల్గొన్నారు.

వేపచెట్టు కొమ్మల తొలగింపు



అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న పురాతన వేప చెట్టు కొమ్మలు విరిగి పడుతున్నాయని హెచ్ఎం బలరాముడు అధికారులకు వివరించారు. ఆయన వినతి మేరకు కొమ్మలను తొలగించారు. ఆదివారం చెట్టు కొమ్మలు విరిగి పడిన విషయాన్ని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాకు హెచ్ఎం తెలియజేశారు. దీంతో మంగళవారం చెట్టుకు బలహీనంగా ఉన్న కొమ్మలను పూర్తి స్థాయిలో తొలగించినట్లు కమిషనర్ తెలిపారు.

హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

వనపర్తి టౌన్: హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సదుపాయాలు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ రోడ్డు గంజి ఎదుట ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం హాస్టళ్లపై నిర్లక్ష్యం వ్యవహరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే హాస్టళ్ల పరిస్థితుల మీద ఉన్నతాధికారులతో సమీక్షించి, జిల్లా వ్యాప్తంగా మౌలిక వసతులు, సొంత భవనం నిర్మించాలని, అదేవిధంగా హాస్టల్ అడ్మిషన్ కోసం నూతనంగా పెట్టిన ఆన్‌లైన్ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. మెస్, క్యాస్మోటిక్ చార్జీలు పెంచాలని, శాశ్వత వార్డెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీస్‌లు ఏబీవీపీ నాయకులను బలవంతంగా రోడ్డుపై నుంచి లేపి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జగదీశ్, నాయకులు కేదార్‌నాథ్, రమ్య, శివ, నవీన్, కార్తీక్, పరశురాం, సాయిరాం పాల్గొన్నారు.

రామయ్య అక్షింతలు పంపిణీ



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని మర్రికుంటలో మంగళవారం భక్తులు ఆంజనేయ స్వామి ఆలయంలో అయోధ్య నుంచి వచ్చిన పూజిత అక్షింతల కలశాలకు పూజలు నిర్వహించి, గ్రామంలోని ఇంటింటికీ తిరిగి అక్షింతలతో పాటు ఫొటో, కరపత్రాన్ని పంపిణీ చేశారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి అక్షింతలు అందించారు. ఈ నెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన కొనసాగే సందర్భంగా ఇళ్లల్లో పూజలు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరంగాపురం ఎంపీపీ వినీలా రాణి , జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



‘నా పేరుచెప్పి వసూళ్లకు ప్రయత్నిస్తే నమ్మొద్దు’

● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి: తన పేరు చెప్పి ఎవరైనా డబ్బుల వసూళ్లకు ప్రయత్నిస్తే నమ్మొద్దని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు రైస్ మిల్లర్లతో, ఇసుక రీచ్‌ల వద్ద, మద్యం దుకాణాలు, పలు వ్యాపారుల వద్ద తన పేరుతో వసూళ్లకు ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న అభియోగాల దృష్ట్యా ఈ ప్రకటన విడుదల చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇకపై ఎవరైనా వసూళ్ల కోసం వస్తే.. నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని కోరారు.

మాట ఇస్తే నిలబెట్టుకుంటా..

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వనపర్తి మండలంలోని చందాపూర్‌ను దత్తత గ్రామంగా స్వీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెల్లడించారు. మంగళవారం చందాపూర్‌కు వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలోని పాఠశాల నుంచి మహాత్మాగాంధీ విగ్రహం వరకు రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు భూమిపూజ చేశారు. గ్రామస్తులు నిర్వహించిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏయే గ్రామాల్లో ఇచ్చిన హామీలేంటో తనకు గుర్తున్నాయని, తప్పకుండా అన్నింటినీ నెరవేర్చుతానని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తం కాంగ్రెస్ విజయ భేరీ మోగిస్తుందని జోస్యం చెప్పారు. పెండింగ్ కెనాల్ పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య యాదవ్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, సర్పంచ్ చెన్నారెడ్డి, ఉపసర్పంచు చంద్రశేఖర్, ఎంపీడీఓ సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



తూంపల్లిలో..



కిష్టాపూర్‌లో బడిఈడు పిల్లల సర్వేలో సీఆర్పీలు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, మధ్యలో చదువు మానేసిన పిల్లలను పాఠశాలలకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని కత్తేపల్లి, తూంపల్లి గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు.

పాన్‌గల్: చదువుకోవడం ద్వారా బంగారు భవిష్యత్తు, సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సీఆర్పీ గోవింద్‌నాయక్ అన్నారు. బడిఈడు పిల్లల ఇంటింటి సర్వేలో భాగంగా మంగళవారం మండలంలోని కిష్టాపూర్, రేమద్దులలో బడిమానేసి ఇంటి పనులు చేస్తున్న విద్యార్థుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారి ఇళ్లకు వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నభోజనం, మెరుగైన విద్య అందుతుందన్నారు. బడిఈడు కలిగిన పిల్లలచే పనులు చేయించడం నేరమని, చదువుకోవడం వారి హక్కు అని బడిఈడు కలిగిన పిల్లలను తప్పక బడులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు సంతోష్, కేశవులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



ఆశావర్కర్లకు సూచనలిస్తున్న మండల వైద్యాధికారి వంశీకృష్ణ

వీపనగండ్ల: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామీణులకు అవసరమైన సూచనలు ఇవ్వాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశా డే ను పురస్కరించుకుని ఆశావర్కర్లు, ఏఎన్ఎంలకు ప్రజల ఆరోగ్య పరిరక్షణపై అవసరమైన సలహాలు ఇచ్చారు. ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని, అనారోగ్యానికి గురైన వారికి అవసరమైన మందులు ప్రతినిత్యం వారి ఇంటికి వెళ్లి అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమవర్ధన్, డాక్టర్ శ్వేత, భవ్యశ్రీ, పీహెచ్ఎన్ నాగరత్నమ్మ, కరుణ, మంజుల, దయామణి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్లకు కనీస వేతనం ’26 వేలు ఇవ్వాలి

ఖిల్లాఘనపురం: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట అంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో లక్ష్మీనారాయణ అధ్యక్షతన తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్ల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 51 ని రద్దు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ల పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఫాతిమా షేక్‌కు నివాళి



ఫాతిమా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు

వనపర్తి టౌన్: భారతదేశ మొదటి ముస్లిం టీచర్‌గా, సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా ఫాతిమా షేక్ అందించిన సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరి రాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా, దప్పు నాగరాజు, పరమేశ్వర చారి, మాధవచారి, సత్యం చారి, రమేష్ చారి, శంకర్‌నాయక్, జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు



అమరచింతలో..



పాన్‌గల్ ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు నమోదులో ఆపరేటర్లు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగవంతంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని పది వార్డుల్లో మొత్తం 5,507 దరఖాస్తులు, మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 9,158 దరఖాస్తులు కలిపి మొత్తం 14,665 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు ఉన్నారు.

అమరచింత: పట్టణంలో వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను మూడు రోజుల నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. ఇప్పటి వరకు 80 శాతం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో పొందుపర్చామన్నారు.

పాన్‌గల్: ఆరు గ్యారంటీల పథకాల అమలు కోసం ప్రజల నుంచి వచ్చిన ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం మంగళవారం కొనసాగింది. మండలంలోని 28 గ్రామ పంచాయతీలల్లో వచ్చిన 17,030 దరఖాస్తులను ఎంపీడీఓ, తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాలతో పాటు మీసేవా కేంద్రాల్లో వివరాల నమోదు కొనసాగుతున్నట్లు మండల అధికారులు పేర్కొన్నారు. ఆయా వివరాలను ఈనెల 17వ తేదీ వరకు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. నమోదు వివరాలను మండల ప్రత్యేకాధికారి రహిమాన్, ఇంచార్జి ఎంపీడీఓ రఘురాములు, డీటీ అశోక్‌నాయుడు పర్యవేక్షిస్తున్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



అమరచింత: గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి ఎంపీటీసీ హనుమంతు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్క్స్ భవనంలో మంగళవారం మండల స్థాయి గ్రామ పంచాయతీ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాపంథా జిల్లా కార్యదర్శి హనుమంతు, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో అల్లాడుతున్నారని వాపోయారు. పారిశుద్ధ్య పనుల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పంచాయతీ కార్మికులను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే నిర్వహిస్తున్న రాష్ట్ర, జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సామేలు, ప్రసాద్ పాల్గొన్నారు.

మండల నూతన కమిటీ ఎన్నిక

పంచాయతీ కార్మికుల మండల స్థాయి నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా రామచంద్రి, ప్రధాన కార్యదర్శిగా కురుమన్న, సహాయ కార్యదర్శిగా చెన్నప్ప, కోశాధికారిగా మల్లేష్, కార్యవర్గ సభ్యులుగా నాగన్న, కురుమన్న, నరసింహ, అంజి, వెంకటన్న ను నియమించారు.